# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 28 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 5


## ఐసీసీ చైర్మెన్‌గా జైషా ఏకగ్రీవం



**బలగం టీవి, ముంబై**

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఐసీసీ ఛైర్మన్‌గా బీసీసీఐ సెక్రటరీ జై షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవికి కేవలం ఒక్క జై షా నామినేషనే దాఖలైంది. దీంతో ఎలాంటి ఎన్నిక లేకుండానే జై షా క్రికెట్ అత్యున్నత బోర్డుకు ఛైర్మెన్ అయ్యారు. 2024 డిసెంబర్ 1న జై షా ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఈ సందర్భంగా జై షా మాట్లాడారు. 'క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించేందుకు పనిచేస్తాను. ఐసీసీ సభ్య దేశాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నా. 2028 లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ నిర్వహించడం అత్యంత ముఖ్యమైన సవాళ్లు, అవకాశాలలో ఇది ఒకటి' అని అన్నారు.కాగా, ఐసీసీ ప్రస్తుత ఛైర్మన్ జార్జ్ బార్క్లే 2020లో తొలిసారి ఆ బాధ్యతలు చేపట్టారు. 2022లో కూడా తిరిగి ఆయనే ఎన్నికయ్యారు. ఇక మూడోసారి ఆ బాధ్యతల్లో కొనసాగేందుకు జార్జ్ బార్క్లే ఆసక్తి చూపలేదు. నవంబర్‌లో ఆయన పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో జై షా ఎన్నిక జరిగింది.



# సెప్టెంబర్ 17 నుంచి ప్రజాపాలన

- 10 రోజుల పాటు కార్యక్రమాలు
- రేషన్ కార్డులు, హెల్త్ కార్డులపై ఫోకస్
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలి
- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సెప్టెంబర్ 17 నుంచి పది రోజుల పాటు రాష్ట్రమంతటా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేసేందుకు ఈసారి ప్రజాపాలన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు లింకు ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్డుల జారీకి ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను సేకరిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్య కార్యదర్శి శాంతి కుమారితో పాటు సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హెల్త్ డిజిటల్ కార్డుల జారీకి అనుసరించాల్సిన పద్ధతి, హెల్త్ ప్రొఫైల్స్ నమోదుకు చేయాల్సిన వైద్య పరీక్షలు, అందుకోసం వైద్య శిబిరాల నిర్వహణ, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న లాబోరేటరీల వివరాల వంటి అంశాలన్నింటినీ పరిశీలించి కార్యాచరణ సంసిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందించే వైద్య సేవలతో పాటు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు ఇకపై ప్రభుత్వం జారీ చేసే హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందని ముఖ్యమంత్రి చెప్పారు.

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రేటర్ హైదరాబాద్తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ క్రమం మిగితా 2వ పేజీలో

## గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం

- 32 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణం
- ఇప్పుడున్న ఉస్మానియా ఆస్పత్రి చారిత్రక కట్టడానికి పరిరక్షణ
- స్పీడ్ ప్రణాళికలోని పనులపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకోసం గోషా మహల్ పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కలిపి దాదాపు 32 ఎకరాల స్థలాన్ని వెంటనే వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మిగితా 2వ పేజీలో

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చింది. బెయిల్ కోసం రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని సూచించింది. సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. దీంతో దాదాపు 165 రోజుల తర్వాత కవిత జైలు నుంచి బయటకు రానున్నారు.

బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. లిక్కర్ కేసులో దర్యాప్తు పూర్తయ్యిందని.. ఛార్జ్ షీట్ కూడా దాఖలైందని ఈ దశలో కవితను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడం సరికాదని అభిప్రాయడింది. సెక్షన్ 45 ప్రకారం ఒక మహిళ బెయిల్ పొందేందుకు అర్హత ఉందని ధర్మాసనం తెలిపింది. గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టిపారేసింది. సెక్షన్ 45 అనేది దుర్బల మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నట్లు హైకోర్టు జడ్జి వ్యవహరించారని పేర్కొంది. సెక్షన్ 45పై కోర్టులు సున్నితంగా వ్యవహరించాలని చెప్పింది. ఒక మహిళ విద్యాధికురాలు అయినంత మాత్రాన ఆమెకు బెయిల్ నిరాకరించడం సరికాదని తెలిపింది. ఈ మేరకు ఆమె బెయిల్ పిటిషన్‌పై విచారించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈడీ, సీబీఐ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అనంతరం కవిత తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఒక్కో కేసులో రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించగా, వారు పూచీకత్తును కోర్టుకు సమర్పించారు. అలాగే సాక్షులను ప్రభావితం చేయరాదని తెలిపారు. పాస్‌పోర్టు డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వీటన్నింటికీ ఒప్పుకున్న పిటిషనర్ కవిత అన్ని నిబంధనలను పూర్తిగా కంప్లీట్ చేసి జైలు నుంచి మిగితా 2వ పేజీలో

**బెయిల్ ఆర్డర్‌లోని కీలక అంశాలు**

- పాస్‌పోర్టును మెజిస్ట్రేట్‌కు సరెండర్ చేయాలి.
- విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలి.
- కేసు ట్రయల్‌కు సహకరించాలి
- విచారణ వాయిదాల సమయంలో దర్యాప్తు సంస్థలకు సహకరించాలి

### కవిత బెయిల్
## బీఆర్ఎస్, కాంగ్రెస్ విజయం





- బండి సంజయ్
- బండి సంజయ్ వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కవితకు బెయిల్ లభించడం పట్ల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ విజయం సాధించాయని వ్యాఖ్యానించారు. రెండు పార్టీలు అలుపెరగని విధంగా బెయిల్ కోసం ప్రయత్నాలు సాగించాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకురాలు బెయిల్‌పై బయటకు రాగా.. కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారని బండి సంజయ్ గుర్తు చేశారు. అభిషేక్ మను సింఘ్వీని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తెలంగాణ నుంచి రాజ్యసభకు నామినేట్ చేసిన విషయాన్ని బండి సంజయ్ పరోక్షంగా ప్రస్తావించారు. మొదట బెయిల్ కోసం బీఆర్ఎస్ తరపున వాదించిన అభిషేక్ మను సింఘ్వీని రాజ్యసభకు పంపించడంలో కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ సహకరించారని ఆరోపించారు. ఈ విషయంలో కేసీఆర్ అద్భుతమైన రాజకీయ చతురతను ప్రదర్శించారని చురకలు అంటించారు.

**బండి సంజయ్‌పై చర్యలు తీసుకోండి.. కేటీఆర్**

ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయటంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయశాఖ మంత్రిగా ఉన్న బండి సుప్రీంకోర్టు తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేయడం సరికాదని తెలిపారు. గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇలా స్పందించడమేంటని నిలదీశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు కంటెంప్ట్ ఆఫ్ ప్రొసిడింగ్స్ కిందకు వస్తాయని.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## టీచర్లు లేక మూతపడుతున్న పాఠశాలలు



- మాజీ మంత్రి హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుంది.. కానీ కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తరగతి గదుల్లో చదువుకు నోచుకోని పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి కాదు రెండు కాదు 43 పాఠశాలలు.. అదీ గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక మూతపడటమంటే పాలకులు సిగ్గుతో తలదించుకోవాన్నారు. ప్రభుత్వ తప్పిదం వల్ల గిరిజనులు ప్రాథమిక విద్యకు దూరం కావడం క్షమించరాని నేరమని తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించింది ఉన్న స్కూళ్లను మూత వేయడానికా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని మూతపడ్డ 43 ప్రభుత్వ పాఠశాలలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. టీచర్ల నియామకం జరిగేవరకు విద్యా వాలంటీర్లను నియమించాలని విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు లేరన్న కారణంతో రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాల కూడా మూతపడకుండా చూడాలని, వెంటనే ముఖ్యమంత్రి స్థాయిలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

## రాజ్యసభ సభ్యుడిగా మను సింఘ్వీ ఏకగ్రీవం



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ ఉపసంహరణ గడువు ముగిసింది. కాంగ్రెస్ తరఫున అభిషేక్ మను సింఘ్వీ, ఇండిపెండెంట్ గా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఎమ్మెల్యేలు బలపరచకపోవడంతో పద్మరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురయింది. దీంతో రాజ్యసభ సభ్యుడిగా సింఘ్వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింఘ్వీ తరఫున కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. అభిషేక్ సింఘ్వీ రెండు దఫాలుగా(2006, 2018) రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. ఈ ఏడాది హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేసి బీజేపీ చేతిలో ఓడిపోయారు.

## నేడు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు బుధవారం ఉదయం 11 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో భూమిపూజ నిర్వహించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈ ఏడాది డిసెంబర్ 9న ఆవిష్కరించనున్నట్టు సీఎం ప్రకటించినట్లుగానే తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని మంత్రి తెలిపారు. కాగా, ఈ భూమిపూజ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు.

## విద్యాసంస్థల్లో స్పోర్ట్స్ పిరియడ్లు తప్పనిసరి

- ప్రతి ఏటా పాఠశాలలో క్రీడా పోటీలు
- క్రీడా నగరంగా హైదరాబాద్ ను చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ –ఇకపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో తప్పనిసరిగా స్పోర్ట్స్ కు సంబంధించిన పీరియడ్ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అంటున్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల క్రీడా పోటీలను నేడు ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు.ప్రపంచ స్థాయిలోనే తెలంగాణ నుంచి అద్భుతమైన మిగితా 2వ పేజీలో

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో
## వైద్యాన్ని ప్రభుత్వం విస్మరిస్తోంది..

- ఆసుపత్రుల్లో మందుల కొరత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

వివరాలు 2వ పేజీలో

## హైడ్రా నోటీసులు ఇవ్వదు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైడ్రా నోటీసులు ఇవ్వదని, కేవలం కూల్చడమే ప్రధానమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ ఆక్రమించి కళాశాలలు నిర్మించే యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే అందులో చదివే విద్యార్థుల భవిష్యత్ కూడా ముఖ్యమని వారిని రోడ్డున పడేయకుండా ఆయా కళాశాలల యాజమాన్యానికి కొంత సమయం ఇస్తామని తెలిపారు. హైడ్రా కమిషనర్‌ను మంగళవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుద్ధభవన్‌లో ఉన్న హైడ్రా కార్యాలయంలో కలిసి చెరువులు, పార్కుల ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. ఓవైసీ, మల్లారెడ్డి సహా పలు ఆక్రమణలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా హైడ్రా చర్యలుంటాయని కార్పొరేటర్లకు వివరించారు. ఒవైసీ, మల్లారెడ్డి అని చూడం, విద్యార్థుల భవిష్యత్తు ఆలోచిస్తాం... చెరువులు ఆక్రమించి కళాశాలలు కట్టడం వాళ్ల తప్పే ఉండొచ్చు... ఎఫ్‌టీఎల్ ప్రధాన అంశమే అయినా విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యం అన్నారు. ఒవైసీ, మల్లారెడ్డి కళాశాలలకు సమయం ఇస్తామన్నారు. ధర్మ సత్రమైనా ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేస్తామన్నారు. మరోవైపు ఫిర్యాదుదారుల తాకిడి పెరగడంతో హైడ్రా కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు పెంచారు.



## యాదాద్రిలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**బలగం టీవి, యాదగిరిగుట్ట**

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం యాదాద్రి ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నారసింహుడికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత గవర్నర్‌కు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందచేశారు. గవర్నర్ బుధవారం ఉదయం 8 గంటలకు లక్నవరం నుంచి హనుమకొండ జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం 2.20 గంటలకు ఆలేరు మండలంలోని కొలనుపాక జైన దేవాలయాన్ని, సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 5.15 గంటలకు భువనగిరి కలెక్టరేట్‌లో రచయితలు, కళాకారులు, ప్రముఖులు, రాష్ట్ర జాతీయ అవార్డు గ్రహీతలను కలుస్తారు.

## బెంగాల్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మంగళవారం విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. 'పశ్చిమబంగా ఛాత్రో సమాజ్' విద్యార్థి సంఘం సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'నబన్నా అభియాన్' పేరుతో భారీ ర్యాలీ చేపట్టారు. మిగితా 2వ పేజీలో

# బీసీలను మేయర్ అవమానిస్తుండు..

- మేయర్ తీరును అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తాం
- డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి



**బలగం టీవీ, కరీంనగర్**

మేయర్ సునీల్ రావు వ్యవహార శైలితో గత నాలుగున్నర సంవత్సరాలుగా కుమిలిపోతున్నామని, అగ్రవర్ణ అహంకారంతో బీసీలను మేయర్ అవమానపరుస్తున్నాడని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి ఆరోపించారు. మంగళవారం కరీంనగర్ పట్టణంలోని డిప్యూటీ మేయర్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి మాట్లాడుతూ మేయర్ సునీల్ రావు ఆగస్టు 23 న అమెరికా పర్యటనకు వెళ్ళే విషయం, డిప్యూటీ మేయర్ అయినా నాకు,మాట వరుసకు కూడా చెప్పలేదు అని అన్నారు. ఆగస్టు 23న రాత్రి 8 గంటలకు మేయర్ పిఏ మున్సిపల్ గ్రూపులో మేయర్ అమెరికా వెళ్లాడని ,మెసేజ్ పెట్టడం ద్వారా యూఎస్ కు వెళ్లినట్టు తెలిసింది అని అన్నారు. రెండు వారాల పాటు మేయర్ అమెరికా వెళ్లాడని అనే విషయం మెసేజ్ ద్వారా తెలిసింది అని, మేయర్ రెండు వారాలు కాదు... 33 రోజులు వెళ్తున్నడని అని అన్నారు.

మున్సిపల్ యాక్ట్ ప్రకారం 15 రోజులు కానీ అంతకన్నా ఎక్కువ రోజులు మేయర్ అందుబాటులో లేకుంటే, డిప్యూటీ మేయర్ కు ఇన్ ఛార్జ్ ఇవ్వాలని చట్టం చెబుతుంది అని అన్నారు.మేయర్ టిక్కెట్ ప్రకారం 33 రోజుల పాటు అమెరిక పర్యటన ఉంది కాబట్టి, డిప్యూటీ మేయర్ ఉన్నా నాకు మేయర్ గా ఇంచార్జ్ ఇవ్వాలని కలెక్టర్ ను కోరామని అన్నారు.స్పందించిన కలెక్టర్ అమెరికా వెళ్ళిన మేయర్ కు నోటీసు పంపించారు అని, ఆ నోటీసుకు జవాబుగా మేయర్ సునీల్ రావు నెల రోజుల కొరకు వచ్చింది వాస్తవమే, కానీ సెప్టెంబర్ 6 వరకు ఇండియా కు వస్తున్నానని కలెక్టర్ కు మెసేజ్ చేశారని తెలిసింది అని అన్నారు.

కలెక్టర్ నోటీసు ఇచ్చిన వెంటనే, మేయర్ హుటాహుటిన టికెట్ రద్దు చేసుకొని రావడం చూస్తే నగరపాలక సంస్థలో నలుగున్నరేళ్లలో ఎన్ని తప్పులు జరిగాయోనని అనుమనించాల్సి వస్తోంది అని అన్నారు.జూన్ 25 తేదీ రోజే 33 రోజులు కొరకు అప్ అండ్ డౌన్ ఫ్లైట్ టికెట్ తీసుకున్న మేయర్, రెండు నెలల తర్వాత అమెరికా వెళ్లారు,14 రోజులు మాత్రమే అమెరికాకు వెళ్ళే ఉద్దేశముంటే,గత 2 నెలలుగా టికెట్ ను ఎందుకు 14 రోజులకు మార్చుకో లేదు అని అన్నారు. మేయర్ గా ఇన్చార్జి బాధ్యతలు కలెక్టర్ ని అడగగానే హుటాహుటిన 33 రోజుల టికెట్ కేన్సిల్ చేసుకొని 14 రోజులకే తిరిగి వస్తున్నాడు అంటే, కేవలం బీసీ మహిళ అయిన నాకు ఇన్చార్జి ఇవ్వడం ఇష్టం లేకనే అని అన్నారు.

ఒక బీసీ మహిళగా నాకు ఇన్చార్జి మేయర్ గా అవకాశం ఇవ్వద్దనే దురుద్దేశం తో వెళ్ళేటప్పుడు చెప్పక పోవడం, చార్జి ఇవ్వాలని కలెక్టర్ కు విన్న వించగానే నెల రోజుల పర్యటనను 15 రోజుల్లో ముగించుకొని తిరిగి వస్తున్నాడంటే ఒక్కసారి కరీంనగర్ ప్రజలు ఆలోచించాలని అన్నారు.

నాలుగున్నర సంవత్సరాలుగా డిప్యూటీ మేయర్ గా ఎటువంటి గౌరవం ఇవ్వకున్నా, పార్టీ విధేయులుగా మౌనంగా ఉన్నామని, గడిచిన నాలుగున్నర సంవత్సరాలు గా అంతర్గతంగా ఎన్ని అవమానాలు జరిగినా ఓపికగా, అధిష్టానం ఆదేశాల మేరకు మౌనంగా ఉండడం జరిగిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మేయర్ పై చర్య తీసుకోవాలని అన్నారు.

తెలంగాణ కోసం పోరాడాడనో, ఇంకా ఏదో చేశాడనో బిఆర్ఎస్ అధిష్టానం సునీల్ రావుకు మేయర్ పదవి కట్టబెట్టలేదు అని,సునీల్ రావుకు మేయర్ పదవి మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్న పెట్టిన భిక్ష అనిఅన్నారు.మేయర్ పదవి ఇచ్చిన వినోద్ కుమార్ కి సున్నం పెట్టిన ఘనత సునీల్ రావుది అని,పార్లమెంట్ ఎన్నికలవేళ వినోద్ కుమార్ తరపున ప్రచారానికి దూరంగా ఉన్నారు అని,ఇప్పుడు రాజకీయ స్వార్థం కోసమే బండి సంజయ్ పేరు వాడుకుంటున్నాడ అని అన్నారు.

చల్ల హరిశంకర్ మాట్లాడుతూ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు,ఓవైపు వర్షాకాలం ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు,వినాయక చవితికి ఎలాంటి ఏర్పాట్లు కూడా చేపట్టలేదు, ఇలాంటి పరిస్థితుల్లో డిప్యూటీ మేయర్ కు ఇన్చార్జి ఇవ్వకుండా యూఎస్ ఎలా వెళ్లారునీ సునీల్ రావు ను ప్రశ్నించారు. మేము ఫుల్ ఛార్జ్ అడగలేదు,కేవలం ఇంచార్జ్ మాత్రమే అడిగాము, ఇంచార్జి మేయర్ పదవిని బిసి మహిళకు ఇచ్చే అర్హత కూడా లేదా అని అన్నారు.

గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో డిప్యూటీ మేయరు ను ఏ అధికారిక కార్యక్రమానికి పిలిచిన పాపాన పోలేదు,మేయర్ వ్యవహార శైలి చూస్తుంటే మున్సిపాలిటీలో పెద్దఎత్తిన అవినీతి జరిగినట్టు అర్థమవుతుంది అని ఆరోపించారు. మున్సిపాలిటీలో ప్రతి సెక్షన్ వైజ్ గా సమాచారం తీసుకొని తప్పులు జరిగితే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి,వెలికి తీయడమే ధ్యేయంగా పనిచేస్తామని,నిధులు దుర్వినియోగం జరిగినట్టు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యాన్ని ప్రభుత్వం విస్మరిస్తోంది..

- ఆసుపత్రుల్లో మందుల కొరత ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- మాజీ మంత్రి హరీష్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్**

ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కు అయిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి కాంగ్రెస్ పాలనలో దిక్కులేకుండా పోయింది అని,నిత్యం వేలాదిమందికి వైద్యసేవలు అందించే ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాదని అని మాజీ మంత్రి హరీష్ రావు ప్రభుత్వంపై మండిపడ్డారు.మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత ప్రభుత్వ వైఫల్యా నికి నిదర్శనమని ఎండగడుతూ పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఆసుపత్రిలో మందుల కొరత కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు లేవని చేతులెత్తేయడంతో చేసేది లేక రోగులు ప్రైవేటు ఫార్మసీలకు వెళ్తున్నారు. డబ్బులు చెల్లించి మందులు కొనుగోలు చేస్తూ ఆర్థిక భారాన్ని మోస్తున్నారు అని అన్నారు.మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు,ఒక్క ఎంజీఎం ఆసుపత్రే కాదు దాదాపు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు నిండుకున్నాయని అన్నారు.అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మూడు నెలలకు సరిపడా మందులు బఫర్ స్టాక్ గా పెట్టుకోవాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తుందని మండిపడ్డారు. ప్రైవేటు మెడికల్ షాపులకు లాభం చేకూర్చేందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల సరఫరా నిలివేస్తున్నట్టా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ఆవరణలో ప్రైవేటు ఫార్మసీలను ఎందుకు కొనసాగిస్తున్నట్లు, ఆసుపత్రులకు మందులు సరఫరా చేయాల్సిన టిఎస్ఎంఎస్ఐడీసీ ఏం చేస్తున్నదని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభుత్వ ఆసుపత్రులకు శాపంగా మారుతున్నదని, బీఆర్ఎస్ పాలనలో ప్రజల మన్ననలు పొందిన ప్రభుత్వ ఆసుపత్రులు కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆగ్రహానికి గురవుతున్నాయని,ఇప్పటికైనా స్పందించి అన్ని రకాల మందులు ఆసుపత్రుల్లో అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులపై ఆర్థిక భారం పడకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ..

**బలగం టీవి, వేములవాడ**

వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు మంగళవారం పరామర్శించారు. భీమారం మండలం గోవిందారం లో పాత్రికేయులు వనపర్తి దేవయ్య తండ్రి వనపర్తి రాజం అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే బీఆర్ఎస్ కార్యకర్త గంగాధర్ సోదరుడి కుమారుడు పుట్టగానే మరణించగా వారి కుటుంబ సభ్యులను, మోతుకురావుపేట గ్రామంలో కార్యకర్త పోతర్ల శ్రీనివాస్ తల్లి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. సీనియర్ నాయకులు లోలోపు రాజిరెడ్డి, ప్రభాకర్, సురేందర్ రావు, రజాజి చారి, అజిత్ రావు, సురేష్, ఆనంద్, గంగాధర్, సతీష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

# సెప్టెంబర్ 17 నుంచి ప్రజాపాలన

(మొదటి పేజి తరువాయి)

తప్పకుండా జరిగేలా చూడాలని, ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలని సీఎం ఆదేశించారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయాలని సీఎం హెచ్చరించారు.

జీహెచ్ఎంసీ పరిధిలోని అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే పోలీసు విభాగం, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సహకారంతో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని జిల్లాల్లోనూ కలెక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులు సీజనల్ వ్యాధులపై వెంటనే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, పలు గ్రామాలు, పట్టణాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. డెంగ్యూ, చికున్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్పై సంబరాలు



**బలగం టీవీ , తంగళ్లపల్లి**

ఎమ్మెల్సీ కవిత కు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచ వ్యాప్తంగా తెలియ జేసిన నాయకురాలు కవిత అని, కేసీఆర్ పై రాజకీయ కుట్రలలో భాగంగానే కవితను ఢిల్లీ లిక్కర్ స్కాం లో జైలుకు పంపారని ఈ సందర్భంగా వారు తెలిపారు.కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని రాజకీయ కుట్రలు చేసిన తిప్పి కొడతామన్నారు. ఈడీ , సీబీఐ కేసులపై బెయిలు మంజూరు చేసిన సుప్రీంకోర్టు కు ధన్యవాదములు తెలియ జేశారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీలు పడిగల మానస, పూసపెల్లి సరస్వతి, మాజీ సర్పంచ్ కోడం సంధ్యారాణి, వనం లావణ్య, లలిత, పద్మ, సువర్ణ, చెందన, జనాభాయ్ తదితర మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్

(మొదటి పేజి తరువాయి)

విడులయ్యారు. ఈ ఏడాది మార్చి 15న ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. కవిత 5 నెలలకు పైగా తీహాడ్ జైలులోనే ఉన్నారు.

**నేడు మధ్యాహ్నం హైదరాబాద్‌కు కవిత**

ఎమ్మెల్సీ కవిత బుధవారం మధ్యాహ్నం 2:45 గంటలకు ఢిల్లీ నుండి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. కవిత వెంట ఆమె భర్త అనిల్ కుమార్, కేటీఆర్, హరీష్ రావు రానున్నారు.

## వడ్డీతో సహా చెల్లిస్తాం : కవిత



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తనను ఇబ్బందులకు గురిచేసిన వారికి తప్పకుండా వడ్డీతో సహ చెల్లిస్తామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తీహార్ జైలు నుంచి విడుదలైన అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. తాను కేసీఆర్ బిడ్డనని.. తప్పు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనను అనవసరంగా జైలుకు పంపి జగమొండిని చేశారన్నారు. "18 సంవత్సరాలు నేను రాజకీయాల్లో ఉన్నాను. ఎన్నోఎత్తుపల్లాలు చేశాను. తన పిల్లలను వదిలి ఐదున్నర నెలలు జైల్లో ఉండడం అనేది చాలా ఇబ్బందికరమైన విషయం. ఇలాంటి ఇబ్బందులకు గురిచేసిన వారికి తప్పకుండా వడ్డీతో సహ చెల్లిస్తాం. సమయం వస్తది.. తప్పకుండా చెల్లిస్తాం. అదే విధంగా ఇలాంటి కష్టసమయంలో మాకు, మా కుటుంబానికి తోడుగా ఉన్నవారికి హృదయపూర్వకంగా పాదాభివందనాలు తెలియ జేస్తున్నాను. అందరికీ కూడా ధన్యవాదాలు. నేను తెలంగాణ బిడ్డను.. కేసీఆర్ బిడ్డను. నేను తప్పు చేసే ప్రసక్తే లేదు. నేను మొండిదాన్ని.. మంచిదాన్ని. నన్ను అనవసరంగా జైలుకు పంపి నన్ను జగమొండిని చేశారు. ప్రజాక్షేత్రంలో ఇంకా గట్టిగా పని చేస్తాం. కమిట్‌మెంట్‌తో పని చేస్తాం. అందరితో కూడా నిలబడి ఉంటాం. మేం ఎవరికీ భయపడం.. న్యాయపరంగా పోరాడుతూనే ఉంటాం. నన్ను అనవసరంగా జైలుకు పంపారు" అని కవిత అన్నారు.

## గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం

(మొదటి పేజి తరువాయి)

ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణం, 15 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 కొత్త పారా మెడికల్ కాలేజీలు, జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలను సీఎం గారు చర్చించారు.

రాబోయే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆసుపత్రి నిర్మాణానికి అనుభజ్ఞులైన ఆర్కిటెక్టులతో డిజైన్లు రూపొందించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడికి చేరుకునే కనెక్టింగ్ రోడ్లను అభివృద్ధి చేయాలని, ఆసుపత్రి చుట్టూ నలు దిశలా రోడ్డు ఉండేలా డిజైన్ చేయాలని చెప్పారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించేలా ప్రణాళికలు ఉండాలని చెప్పారు. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, సేవలన్నీ అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు. ఇప్పుడున్న ఉస్మానియా హాస్పిటల్ భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షించే బాధ్యతను చేపడుతామని సీఎంగారు చెప్పారు. మూసీ రివర్ డెవెలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా అక్కడున్న భవనాలను పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక భవనాలుగా తీర్చిదిద్దుతామని అన్నారు.గోషామహల్ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించినందుకు పోలీసు విభాగానికి ప్రత్నామ్నాయ స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పేట్లబుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ, చుట్టూ ఉన్న స్థలాన్ని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

## బెంగాల్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం

(మొదటి పేజి తరువాయి)

అయితే, వీరిని పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడిక్కడ బారికేడ్లను ఏర్పాటు చేసి విద్యార్థులను నియంత్రించే ప్రయత్నం చేశారు.అయితే, హౌరా బ్రిడ్జ్ వద్ద విద్యార్థులు బారికేడ్లను బద్దలు కొట్టారు. కొన్నింటిని చేతులతోనే లాగి పక్కకు పడేశారు. పోలీసులకుపైకి రాళ్లు రువ్వారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. నిరసనకారులపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. నిరసనకారులపై వాటర్ ఫిరంగులను ప్రయోగించారు. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్తత కొనసాగుతోంది. మరోవైపు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ ఇంటి వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

విద్యార్థుల నిరసన నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం అప్రమత్తమైంది. కోల్‌కతాలో పెద్ద ఎత్తున బలగాలను మోహరించింది. హౌరాలోని రాష్ట్ర సచివాలయం పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 6,000 మందికిపైగా పోలీసులు నగర వ్యాప్తంగా మోహరించారు. ఐజీ, డీఐజీ స్థాయిలోని 21 మంది పోలీసు అధికారులకు ప్రత్యేక భద్రత బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. విద్యార్థుల ర్యాలీ నేపథ్యంలో కోల్‌కతా పోలీసులు, హౌరా సిటీ పోలీసులతోపాటు భారీ రేడియో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్‌లు, డ్రోన్‌లు, వాటర్ ఫిరంగులను ఆ ప్రాంతంలో మోహరించారు. అదేవిధంగా నబన్న పరిసరాల్లో 19 పాయింట్ల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇతర కీలక ప్రదేశాల్లోనూ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

## విద్యాసంస్థల్లో స్పోర్ట్స్ పిరియడ్లు తప్పనిసరి

(మొదటి పేజి తరువాయి)



క్రీడాకారులు తయారు కావాలని జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో తెలంగాణకు ప్రాధాన్యం పెరిగేలా కృషి చేస్తామని అన్నారు. ఇందు కోసం హైదరాబాద్ లో జాతీయ క్రీడలను నిర్వహించేలా కేంద్రాన్ని అనుమతి కోరతామన్నారు. ఇప్పటికి క్రీడలు నిర్వహించుకునేందుకు నిధుల కొరత లేదని చెప్పారు. భవిష్యత్ లోనూ క్రీడా నిధులు పెంచేందుకు కృషి చేస్తామని అన్నారు. తగిన శారీరక శ్రమను ఇచ్చే క్రీడలు లేక విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలుగా మారుతున్నారని..చిన్నప్పటినుంచే వారిని శారీరక శ్రమను ఇచ్చే క్రీడలకు సంసిద్ధం చేసే దిశగా పాఠశాలలు కృషి చ్జేలని అన్నారు.


ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని కలిగి వుండాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్ వేదికలపై తెలంగాణ క్రీడాకారులు విజయాలు సాధించాలని అన్నారు. గత పాలకుల హయాంలో కేటాయించిన క్రీడా సామాగ్రి, క్రీడా ప్రాంగణాలను తగిన రీతిగా మరమ్మతులు చేయించి ఉపయోగించుకుంటామని..తప్పని సరిగా పాఠశాల దశ నుంచే క్రీడా స్ఫూర్తిని ప్రతి విద్యార్థి కలిగి వుండాలని తమ ధ్యేయమని అన్నారు. ఇందుకోసం అవసరమైతే క్రీడా ఉపాధ్యాయ పోస్టులను పెంచుతామని అన్నారు.

## జన్వాడ ఫామ్ హౌజ్ పరిశీలన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో4**

జన్వాడ ఫామ్ హౌస్ సరిహద్దులను , సర్వే నెంబర్లను పరిశీలించేందుకు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు.. బుల్కాపూర్ నాలా( ఫిరంగినాల) సర్వేలో భాగంగా జన్వాడ ఫామ్ హౌస్ ను కూడా అధికారులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా నిర్మించారని ఫిర్యాదులు రావడంతో మంగళవారం కొలతలు తీసుకునేందుకు అధికారులు ఫామ్‌హౌజ్‌కు వచ్చారు. ఇది ఇలా ఉంటే హైడ్రా ఏర్పడిన నేపథ్యంలో ఈ ఫామ్ హౌజ్ యజమాని ప్రదీప్ రెడ్డి దీనిపై హైకోర్టు ను ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు చట్ట ప్రకారం ముందుకు పోవాలని అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే అధికారులు కొలతలు తీసుకుంటున్నట్టు సమాచారం ఈ సర్వేకోసం శంకర్ పల్లి తాసిల్దార్ కార్యాలయానికి చెందిన సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఇరిగేషన్ విభాగానికి చెందిన వర్క్ ఇన్స్పెక్టర్ వచ్చి నాలా స్థితిగతులను పరిశీలన జరుపుతున్నారు, బుల్కాపూర్ నాలా హద్దులు ఆక్రమణల విషయంలో ఇప్పుడే పూర్తి నిర్ధారణకు రాలేమని,, పై అధికారుల సూచనల మేరకు పూర్తి వివరాలు సేకరించి వారికి అందించనున్నట్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్ తేజ తెలిపారు.

## బీఎస్పీ అధ్యక్షురాలిగా మాయావతి ఏకగ్రీవం



**బలగం టీవి, లక్నో**

బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పి) జాతీయ అధ్యక్షురాలిగా మాయావతి ఏకగ్రీవంగా మరోసారి ఎన్నికైనట్లు ఆ పార్టీ మంగళవారం ప్రకటించింది. బీఎస్పి కేంద్ర కార్యవర్గం, జాతీయ స్థాయి సీనియర్ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర పార్టీ విభాగాలు, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ తెలిపింది. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగు పర్యాయాలు పనిచేసిన మాయావతిని రెండు దశాబ్దాల క్రితం తన రాజకీయ వారసురాలిగా ఆ బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం ప్రకటించారు.

# మట్టి విగ్రహాల ఏర్పాటుకు అవగాహన కల్పించాలి....




- మంత్రులు పొన్నం ప్రభాకర్,శ్రీధర్ బాబు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ లో గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం ఘనంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు ఏర్పాట్లపై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. హైదరాబాద్ లో జరిగే గణేష్ ఉత్సవాలు మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షలాది గా పాల్గొన్న అవకాశం ఉన్నందున చేయాల్సిన ఏర్పాట్ల పై మంత్రులు పొన్నం ప్రభాకర్,శ్రీధర్ బాబు లు డిపార్ట్మెంట్ ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ లో జరిగే గణేష్ ఉత్సవాల కోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలని ఆదేశించారు 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో సోషల్ మీడియా ఇతర శాంతి భద్రతల సమస్య వస్తె కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో రంజాన్ , మొహర్రం , బోనాలు విజవంతంగా జరుపుకున్నామని గణేష్ ఉత్సవాలు కూడా ఎలాంటి విఘ్నాలు లేకుండా ప్రశాంతంగా జరుకోవాలన్నారు. పోలీస్ , విద్యుత్, రవాణా, ఆర్టీసి ,మెట్రో ,జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఎ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.గత సంవత్సరం కంటే 10 శాతం విగ్రహాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో 141 లాగింగ్ పాయింట్స్ దగ్గర త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. బేబీ పాండ్స్ ఏర్పాటు చేయాలన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సుప్రింకోర్టు తీర్పు కు అనుగుణంగా పీఓపీ విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలను పూజించేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 7 జోన్ల పరిధిలో జోనల్ కమిషనర్, డిసిపి లతో మండపాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి సూచించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పర్యావరణ మట్టి విగ్రహాలు పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు...

ఉత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల అధికారులు సమన్వయం పై మంత్రులు పొన్నం ప్రభాకర్ శ్రీధర్ బాబు లు దిశా నిర్దేశం చేశారు నిమజ్జనం త్వరగా పూర్తి అయ్యేందుకు హైదరాబాద్, సైబరాబాద్ , రాచకొండ కమిషనరేట్ ల పరిధిలో తీసుకుంటున్న చర్యల పై వివరించారు. ఖైరతాబాద్ వినాయకుడు నిమజ్జనం చేసేటప్పుడు పూర్తిగా మునిగేలా జీహెచ్ఎంసీ అధికారులు అక్కడ ఏర్పాట్లు చేయాలని లేదంటే అక్కడికి భక్తులు అధికంగా వచ్చి ఇతర విగ్రహాలు నిమజ్జనం ఆలస్యం జరిగే అవకాశం ఉందని తెలిపారు. రవాణా శాఖ అధికారులు నిమజ్జనం కోసం వాహనాలు సిద్ధం చేసుకోవాలని టస్కర్ వాహనాలు ,డ్రైవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండపాల నుండి నిమజ్జనం వరకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ప్రతి వినాయకుడితో ఒక పోలీస్ ఉంటే త్వరగా నిమజ్జనం కావడానికి అవకాశం ఉంటుందని సూచించారు .

గణేష్ ఉత్సవాలు జరిగే 11 రోజుల పాటు నగరంలో ట్రాఫిక్ విషయంలో తీసుకోవాల్సిన చర్యల పై సూచించారు పెద్ద వినాయకులు వెళ్ళే ప్రాంతాల్లో ట్రీ ట్రిమ్మింగ్ చేయాలని ,చిన్న విగ్రహాలను టస్కర్ లాంటి పెద్ద వాహ నాలు కాకుండా చిన్న వాహనాలు వాడితే పెద్దగా ఇబ్బం దులు ఉండవన్నారు. ట్యాంక్ బండ్ ,ఎన్టీఆర్ మార్గ్ లో విగ్రహాల నిమజ్జనానికి 22 ప్లాట్ ఫారం లు ఏర్పాటు చేస్తున్నామని హెచ్ఎండిఎ కమిషనర్ వెల్లడించారు. ట్యాంక్ బండ్ పైన 33 క్రేన్స్ పెడుతున్నామని అదనంగా అవసరం ఉంటే మరిన్ని క్రేన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 100 స్టాటిస్టిక్ క్రేన్స్,150 మొబైల్ క్రేన్ ఏర్పాటు చేయనున్నారు. ఈసారి గత సంవత్సరం కంటే ఎక్కువ విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశామని అందుకు తగిన విధంగానే ఏర్పాట్లు చేస్తున్నారు. 10,500 మంది నిమజ్జనం ప్రాంతంలో శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు . నిమజ్జనం తరువాత వెస్టేజ్ కవరేజ్ డంప్ కోసం 100 టిప్పర్స్ ,20 జేసిబి లు ఏర్పాటు చేశారు. ఈసారి జీహెచ్ఎంసీ ,హెచ్ఎండిఎ నుండి 5 లక్షల మట్టి విగ్రహాలు పంపిణీ చేయనున్నారు. అర్అండ్ బి అధికారులు బారికేడ్ల విషయంలో జాగ్రత్త చర్యలు తీసుకోవాలనీ సూచించారు.

ఖైరతాబాద్ దగ్గర డిమాండ్ మేరకు ఉత్సవాల సమయంలో అర్ధరాత్రి వరకు మెట్రో నడిపిస్తమని నిమజ్జనం సమయంలో అర్ధరాత్రి వరకు 1-2 వరకు నడుస్తాయని మెట్రో అధికారులు తెలిపారు. ఎంఎంటీఎస్ రైళ్లు అదనంగా నడవడం, 650 వరకు అందనంగా ఆర్టీసి బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. 108 అంబులెన్స్ లు ప్రత్యేక వైద్య సిబ్బంది ,నిమజ్జనం జరిగే ప్రాంతంలో ప్రాథమిక చికిత్స కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. ఖైరతాబాద్ బడా గణేష్ వద్ద ప్రత్యేక హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలో ఉన్న 4 ప్రధాన వినాయక దేవాలయాలలో ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.

భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి తో పాటు పలు కమిటీ లు ప్రభుత్వం దృష్టికి పలు అంశాలు తీసుకొచ్చారు. భక్తులకు మొబైల్ టాయిలెట్స్ , మంచి నీటి సౌకర్యం ,భక్తులకు ఆహార ఏర్పాట్లు చేయాలని సూచించారు.పోలీసులు అనుమతులు విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మి,డిప్యూటీ మేయర్ ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,మోతే శ్రీలత శోభన్ రెడ్డి , డీజీపీ జితేందర్ తదితరులున్నారు.

# గణేష్ నవరాత్రి వేడుకల్లో డీజేలకు అనుమతి లేదు...



- శాంతియుత వాతావరణంలో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి..
- నిర్దేశించిన సమయానికే విగ్రహాల నిమజ్జనం పూర్తి చెయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నవరాత్రి వేడుకల్లో డీజీలకు అనుమతి లేదని, శాంతియుత వాతావరణంలో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కల్యాణ లక్ష్మీ గార్డెన్స్ లో వివిధ శాఖల అధికారులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై గణేష్ నవరాత్రి ఉత్సవాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,పాటించవలసిన నియమ నిబంధనాలపై దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ పోలీస్ వారికి సహకరిస్తు శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని,పోలీస్ శాఖ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వహకులాదని,ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పకుండ ఏర్పాటు చేయలని,సీసీ కెమెరాల ఏర్పాటు వలన ఏ చిన్న సంఘటన జరిగిన గుర్తించవచ్చని అన్నారు.మండపాల వద్ద మద్యం సేవించడం,అసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే వారితో పాటుగా మండపాల నిర్వహకులు పై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని అన్నారు.

ప్రతి మండపం వద్ద విధిగా పాయింట్ బుక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పోలీస్ అధికారులు,బ్లూ కోల్ట్ సిబ్బంది తరచు మండపాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.ఇనుప వస్తువులతో మండపాలు ఏర్పాటు చేయవద్దని,షాట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రతి మండపాల నిర్వహకులు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలనీ అన్నారు.

**నవరాత్రి ఉత్సవాలలో డిజేలకు అనుమతి లేదు...**

నవరాత్రి వేడుకల సందర్భంగా మండపాల్లో,నిమజ్జనం రోజున డీజే లకు అనుమతి లేదని అన్నారు .అనుమతి లేకుండా డీజే మండపాల్లో కానీ నిమజ్జనం రోజున ఉపయోగిస్తే డీజే వారితో పాటుగా మండపాల నిర్వహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ఇప్పటికే జిల్లాలో డి.జే యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు.

**నిర్దేశించిన సమయానికే విగ్రహాల నిమజ్జనం పూర్తి చేయాలి..**

గణేష్ నిమజ్జనం రోజున గణేష్ శోభయాత్ర రాత్రి 12 లోపు పూర్తి అయ్యేలా భక్తులు,గణేష్ మండపాల నిర్వహకులు పోలీస్ వారికి సహకరించాలని, రెండు మూడు రోజుల పాటుగా నిమజ్జనం చేస్తూ ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గత సంవత్సరం నిబంధనలకు విరుద్ధంగా రెండు మూడు రోజుల పాటుగా నిమజ్జనం చేస్తూ ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై 10 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

నిమజ్జననికి ముందు ప్రతి మండలంలో వివిధ శాఖల సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏమైనా సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ,డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సిరిసిల్ల ఆర్డీఓ రమేష్, మున్సిపల్ కమీషనర్ మీర్జా ఫసత్ అలీ బేగ్, జిల్లా పంచాయితీ అధికారి వీరబుచ్చయ్య,సిఐ లు కృష్ణ, శ్రీనివాస్, మొగిలి,ఎస్ఐ లు హిందూ ఉత్సవ కమిట్ సభ్యులు, మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు..





**బలగం టీవీ, సిరిసిల్ల**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులు గోపిక కృష్ణ వేషధారణలో వచ్చి అల్లరించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజు రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు



## నేడు రాజన్న జిల్లాలో మంత్రి పొన్నం పర్యటన

**బలగం టీవీ , సిరిసిల్ల :**

బీసీ సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం వేములవాడ లో ని శ్రీ రాజరాజేశ్వర స్వామి నీ, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో కలిసి దర్శించుకుని, వేములవాడ పట్టణంలో కెడిసిసి బ్యాంక్ శాఖను ప్రారంభిస్తారు. సిరిసిల్ల పట్టణంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని,టెక్స్టైల్ పార్క్ ను సందర్శిస్తారు. మధ్యాహ్నం ముస్తాబాద్ మండల కేంద్రంలో పలు కార్యక్రమాలలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ కేకే మహేందర్ రెడ్డి తో కలిసి పాల్గొంటారు.



# కవితపై పెట్టిన కేసు..రాజకీయ ప్రేరేపిత కేసు..

- ఢిల్లీ లిక్కర్ కేసులో ఒక్క రూపాయి రికవరీ చేయలేదు..
- కేసీఆర్ ను ఇబ్బంది పెట్టే కుట్ర
- ఆలస్యమైనా బెయిల్‌వచ్చింది..

**కవితకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ,బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్**




**బలగం టీవీ, హైదరాబాద్ :**

ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడం పట్ల సంతోషంగా ఉందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాదులోని తెలంగాణ భవన్ లో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ,బీఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ కుమార్ లు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్సీ కవిత సంస్కృతి పరంగా కీలక పాత్ర పోషించారు అని,బతుకమ్మ పండుగను ప్రపంచ వ్యాప్తంగా కవిత తీసుకువెళ్లారని అన్నారు.రాజకీయ నేతలు ఈ కేసులో లేకపోతే 15 రోజుల్లో బెయిల్ వచ్చే కేసు ఇది అని,బీజేపీ వ్యతిరేక పార్టీలకు చెందిన రాజకీయ నేతలు ఈ కేసులో ఉన్నారు కాబట్టే,జైల్లో పెట్టారు అని అన్నారు.ఢిల్లీ లిక్కర్ కేసులో ఒక్క రూపాయి రికవరీ చేయలేదు,లిక్కర్ పాలసీ నిర్ణయం పైన కేసులు పెట్టారు అని,సౌత్ గ్రూప్ అని పేరు పెట్టి అహంకారంతో వ్యవహరించారు అని అన్నారు.మహిళలకు బెయిల్ విషయంలో కొన్ని చట్టబద్ధమైన హక్కులు ఉంటాయి,ఢీల్లి హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది అని,ఆలస్యం అయినా ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చింది అని అన్నారు.

చార్జీషీట్ దాఖలు చేసిన తర్వాత జైల్లో ఎందుకు ఉండాలని కోర్టు అడుగుతే,అడిషనల్ సాలిసిటర్ జనరల్ ఆ ప్రశ్నకు నీళ్ల నమిలారు అని,సూచనలు, సమాధానం తీసుకుని సమాధానం చెబుతా అని అడిషనల్ సాలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారని, అంటే జైల్లో ఎన్ని రోజులు జైల్లో ఉండాలనేది అమిత్ షా నిర్ణయిస్తారా అని ప్రశ్నించారు.

బండి సంజయ్ అనాలోచిత వ్యాఖ్యలు చేస్తున్నారని,బండి సంజయ్ కి అసలు తెలివి ఉందా అని అన్నారు.సుప్రీంకోర్టులో లాయర్లు పార్టీల తరపున ఉండరు అని,ముకుల్ రోహత్గీ బీజేపీ ప్రభుత్వంలో సుప్రీంకోర్టులో అటార్నీ జనరల్ గా ఐదేళ్ళు పని చేశారు అని,ముకుల్ రోహత్గీ సీనియర్ లాయర్ అని అన్నారు.కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి హోదాను బండి సంజయ్ కాపాడుకోవాలి,మేము బాంఛన్ అంటే కవిత ఎప్పుడో బయటకు వచ్చేది, కానీ చట్ట ప్రకారం కొట్లాడ దామనే మేము ముందుకు వెళ్లామని అన్నారు.

స్త్రీలను ఇబ్బంది పెట్టిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ పై బీజేపీ చర్యలు తీసుకోలేదు,బీజేపీలో చేరిన హిమంత బిశ్వశర్మపై కేసులు లేకుండా చేసి సీఎంను చేశారు అని అన్నారు. ఏపీ లో టీడీపీ నుంచి బీజేపీ లో చేరిన ఇద్దరు రాజ్యసభ సభ్యుల పై ఈడీ కేసులు ఎందుకు నడవడం లేదు,ఇలా చెప్పుకుంటూ పోతే బీజేపీ లో చేరిన ఎంతో మంది నేర చరితుల పై విచారణ జరగడం లేదు అని,బీజేపీలో చేరితే కేసులు లేకుండా చేస్తున్నారని అన్నారు.

సోమా భరత్ కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ ను ఇబ్బంది పెట్టే కుట్ర చేశారు అని,కవిత కు బెయిల్ పై కొందరు కాంగ్రెస్ నేతలు పిచ్చి వ్యాఖ్యానాలు చేస్తున్నారని అన్నారు.న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల పై వ్యాఖ్యానించే ముందు అన్ని తెలుసుకుని మాట్లాడాలని,ఈ తీర్పు కు రాజకేయాలకు సంబంధం లేదు అని,కోర్టు ను కించపరిచేలా మాట్లాడితే కోర్టు ధిక్కరణ కేసులు వేస్తామని అన్నారు..

# బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే




- ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఎస్పీ అఖిల్ మహజన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహజన్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.అందులో భాగంగా సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 12 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు.

భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని అన్నారు .గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామనిఅన్నారు .

# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**బలగం టీవీ , సిరిసిల్ల :**

సిరిసిల్ల పట్టణంలోని భారతీయ విద్యా నిలయం పాఠశాల లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం పలువురు విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణాకర్ రెడ్డి విద్యార్థులకు శ్రీకృష్ణుని చరిత్రని తెలియచేస్తూ,ప్రతి ఒక్కరూ భగవద్గీత భక్తిశ్రద్ధలతో చదవాలని పిలుపునిచ్చారు.

# 8 నెలల కాలంలో 30 వేల ఉద్యోగాలు భర్తీ..

- యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




**బలగం టీవీ ,వేములవాడ**

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే అంశంపై పక్కా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని, 8 నెలల కాలంలో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు .ఆదివారం రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆద్వర్యంలో వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్ మెగా జాబ్ మేళా ఆదివారం నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాబ్ మేళాకు జిల్లాతో పాటు హైదరాబాద్ వివిధ జిల్లాలకు చెందిన పలు ప్రైవేటు కంపెనీలు దాదాపు 46 పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అక్కడ ఏర్పాటు చేసిన ఆయా సంస్థల స్టాల్స్ ను సందర్శించారు. ఆయా సంస్థల్లో ఎందరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు, ఉద్యోగం చేసేది ఎక్కడ, చేసే పని ఏమిటి, వేతనాలు ఎంత ఇస్తారు వసతి సౌకర్యం కల్పిస్తారా తదితర అంశాలపై ఆరా తీశారు.

అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గురుకుల విద్యాలయాల్లో ఉద్యోగాలను భర్తీ చేసిందని, ఇటీవల టీచర్ల నియామకానికి మెగా డీఎస్సీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించి, కీ కూడా విడుదల చేసిందని అన్నారు. గ్రూప్-4 ఉద్యోగాలకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొనసాగుతుందని, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను కూడా పూర్తి చేసి, మెయిన్స్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని అన్నారు . ఈ ఎనిమిది నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇప్పటికే జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని అన్నారు.

.హైదరాబాద్‌లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నదని,ప్రభుత్వ ఉద్యోగాలతోపాటుగా ప్రైవేటు కంపెనీల్లో యువతకు కొలువులు ఇప్పించేందుకు జాబ్ మేళాలు చేపడుతున్నదని, వచ్చిన ప్రతి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యువత వివిధ అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని,యువత ఉద్యోగాలు ఎక్కడ వచ్చినా వెళ్లాలని అన్నారు . గంజాయి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత, తల్లిదండ్రులు భాగస్వామ్యులు కావాలని, జాబ్ మేళాలు ప్రతి ఆరు నుంచి ఎనిమిది నెలలకు ఒక్కసారి నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు మాజీ సర్పంచులు



**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బండ లింగంపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొత్తపల్లి వాణి నర్సింలు రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ పడిగెల రవి ఆదివారం సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.వీరికి కండువా కప్పి పార్టీలోకి సాధర పూర్వకంగా ఆహ్వానించారు.బిఆర్ఎస్ పార్టీలో గత ఐదు సంవత్సరాల నుండి సర్పంచులుగా కొనసాగిన వీరు ఆ పార్టీలో విధానాలు నచ్చక ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందని ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామని మాజీ సర్పంచులు తెలిపారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో 9వ ప్యాకేజీ కింద మల్కాపేట రిజర్వాయర్ నుండి వచ్చే కెనాల్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో మాజీ మంత్రి కేటీఆర్ విఫలం కావడం జరిగిందన్నారు. ఎగువ మానేరు సింగసముద్రం గొలుసు కట్ట చెరువులకు నీటిని అందించే ఈ తొమ్మిదవ ప్యాకేజీ పనిని సత్వరం పూర్తి చేయించే విధంగా జిల్లా కలెక్టర్ తో రివ్యూ నిర్వహించామన్నారు. సుమారు 150 కోట్ల రూపాయల వ్యయంతో ఈ పని పూర్తవుతుందని దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పిస్తానని అన్నారు. అంతేకాకుండా మూడు దఫాలుగా రైతుల రుణమాఫీ జరగగా అర్హత ఉండి మిగిలిపోయిన రైతులకు తాను దగ్గర ఉండి మాఫీ చేయిస్తానని రైతులకు మాట ఇచ్చారు. కార్యకర్తలు వారి పోరాట పటిమతో ప్రస్తుతం ప్రభుత్వ అధికారంలోకి వచ్చిందన్నారు నామినేటెడ్ పదవులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. కార్యకర్తలను పూర్తిస్థాయిలో ఆదుకునే బాధ్యత నియోజకవర్గంలో తాను తీసుకుంటా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మాజీ ఎంపిటిసి కొత్తపల్లి దేవయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి కొండాపురం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, మర్రి శ్రీనివాసరెడ్డి ,కొండాపురం శ్రీనివాస్ రెడ్డి , ఏలూరు రాజయ్య ,గంట బుచ్చగౌడ్ ,చెన్ని బాబు ,ఎల్లా గౌడ్, రమేష్, దండు శ్రీనివాస్ ,దేవేందర్, వంగ మల్లారెడ్డి, గంగయ్య, నందికిషన్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రపంచకప్‌కు భారత్ అమ్మాయిలు సిద్ధం

- **టీ20 వరల్డ్‌కప్‌కు భారత్ జట్టును ప్రకటించిన బీసీసీఐ**
- **హర్మన్ ప్రీత్‌కు సారథ్య బాధ్యతలు**

**బలగం టీవీ, ముంబై**

ఐసీసీ మహిళల టీ20 వరల్డ్‌కప్‌కు భారత జట్టును మంగళవారం బీసీసీఐ ప్రకటించింది. భారత బృందానికి హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నది. 9వ ఎడిషన్‌కు చెందిన వరల్డ్‌కప్ .. ఈసారి యూఏఈలో జరగనున్నది. టీ20 వరల్డ్‌కప్‌కు ఎన్నికైన ప్లేయర్లలో స్మృతి మందాన, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యస్తికా భాటియా, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ థాకూర్, దయాలన్ హేమలత, ఆషా శోభనా, రాధా యాదవ్, శ్రేయాంక్ పాటిల్, సజనా సజీవన్ ఉన్నారు.


ఇదిలా ఉండగా టీ20 ప్రపంచకప్-2024 సవరించిన షెడ్యూల్‌ను ఐసీసీ సోమవారం విడుదల చేసింది. అక్టోబర్ 3 నుంచి 20 దాకా దుబాయ్, షార్జా వేదికలుగా జరగుబోయే ఈ మెగా టోర్నీలో భారత్.. అక్టోబర్ 4న న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్ ద్వారా టైటిల్ వేటను ఆరంభించనుంది. దాయాది పాకిస్థాన్‌తో 6న తలపడనుంది. గ్రూపు దశలో టీమ్‌ఇండియా.. 9న శ్రీలంకతో 13న ఆస్ట్రేలియాతో ఆడాల్సి ఉంది.

పది జట్లను రెండు గ్రూపులుగా విభజించగా గ్రూప్-ఏలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారత్, పాకిస్థాన్, శ్రీలంక ఉండగా గ్రూప్-బీలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ ఉన్నాయి. గ్రూప్ దశలో టాప్-2లో నిలిచిన నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి.




# సిరాజ్ స్థానంలో నవదీప్ సైనీ





- **ఉమ్రాన్ మాలిక్ స్థానంలో గౌరవ్ యాదవ్**
- **దులీప్ ట్రోఫీ జట్లలో మార్పులు**

**బలగం టీవీ, ముంబై**

దులీప్ ట్రోఫీకి ఎంపికైన స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్‌ను 'ఇండియా-బీ' జట్టు నుంచి తప్పిస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. అతని స్థానంలో 'బీ' జట్టులో నవదీప్ సైనీ చేరనున్నాడని తెలిపింది. అనారోగ్యానికి గురైన సిరాజ్.. దులీప్ ట్రోఫీ ప్రారంభ సమయానికి కోలుకుంటాడని భావించట్లేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది.

మహ్మద్ సిరాజ్‌తో పాటు అనారోగ్యానికి గురైన మరో యువ ఫాస్ట్ బౌలర్ ఉమ్రాన్ మాలిక్ కూడా దులీప్ ట్రోఫీకి అందుబాటులో ఉండట్లేదని బీసీసీఐ తెలిపింది. ఉమ్రాన్ మాలిక్ స్థానంలో 'ఇండియా-సీ ' జట్టులో గౌరవ్ యాదవ్ ఎంపికయ్యాడని చెప్పింది. ఇక ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను కూడా ఇండియా-బీ నుంచి విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. అయితే జడేజా స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడి వివరాలు చెప్పలేదు.

ఇండియా బీలో ఉన్న నితీశ్ కుమార్ రెడ్డి ఈ టోర్నీలో పాల్గొనడం ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉందని బీసీసీఐ తెలిపింది. సెప్టెంబరు 5 నుంచి దులీప్ టోర్నమెంట్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతరపురం, బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. కాగా, మొదటి రౌండ్‌కు ఎంపిక చేసిన నాలుగు జట్ల వివరాలు....

ఇండియా ఏ: శుభమన్ గిల్ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివమ్ దూబె, తనుష్ కొటియన్, కుల్దీప్ యాదవ్, ఆకాష్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, అవేష్ ఖాన్, విద్వాత్ కావెరప్ప , కుమార్ కుశాగ్రా, శాశ్వత్ రావత్.

ఇండియా బీ: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్, ముషీర్ ఖాన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, నవదీప్ సైని, యశ్ దయాల్, ముఖేష్ కుమార్, రాహుల్ చాహర్, ఆర్ సాయి కిషోర్, మోహిత్ అవస్తీ , జగదీషన్.

ఇండియా సీ: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), సాయి సుదర్శన్, రజత్ పటిదార్, అభిషేక్ పోరెల్, సూర్యకుమార్ యాదవ్, ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్ యాదవ్, వైషాక్ విజయ్‌కుమార్, అన్షుల్ ఖాంబోజ్, హిమాన్షు చౌహన్, మయాంక్ మార్కండే, ఆర్యన్, సందీప్ వారియర్.

ఇండియా డీ: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అథర్వ, యశ్ దూబె, దేవదత్ పడిక్కల్, ఇషాన్ కిషన్, రికీ భుయ్, సరాన్ష్ జైన్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, ఆదిత్య, హర్షిత్ రాణా, తుషార్ దేశ్‌పాండే, ఆకాష్ సేన్‌గుప్తా, కేస్ భరత్, సౌరభ్ కుమార్.



## షకిబ్‌పై ఐసీసీ చర్యలు

**బలగం టీవీ, ముంబై**

పాకిస్థాన్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌పై కోపంతో బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ బంతి విసిరిన సంఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వెంటనే అంపైర్లకు షకిబ్ క్షమాపణ చెప్పినప్పటికీ.. అతనిపై ఐసీసీ చర్యలు తీసుకుంది. ఈ సంఘటనపై అంపైర్ కెటిల్ బారో తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. షకిబ్ మాత్రం తనదే తప్పంటూ దాన్ని అక్కడితో ముగించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం అంపైర్ రిఫరికీ ఈ సంఘటన గురించి నివేదిక అందించాడు. దీనిపై రిఫరీ చర్యలు తీసుకున్నారు. షకిబ్ మ్యాచ్ ఫీజులో పది శాతం జరిమానాతో పాటు

# దేవర నుంచి ఆసక్తికర పోస్టర్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎన్టీఆర్ హీరోగా అత్యంత భారీ బడ్జెట్‌తో రానున్న చిత్రం 'దేవర'. ఈ సినిమాను రెండు భాగాలుగా తీసుకు వస్తున్నారు దర్శకుడు కొరటాల శివ. మొదటి భాగం సెప్టెంబరు 27న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ చేస్తున్నారు. తాజాగా మూవీటీమ్ ఓ కొత్త ఇంట్రెస్టింగ్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో తారక్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని మొదటి నుంచి ప్రచారం సాగిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ దేవ్-వరగా తండ్రి, కొడుకులుగా కనిపిస్తారంటూ గుసగుసలు వినిపించాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు తాజాగా తారక్ డబుల్ షేడ్‌ను పోస్టర్‌లో రివీల్ చేసింది. 'ది ఫేసెస్ ఆఫ్ ఫియర్' అనే క్యాప్షన్‌తో పోస్టర్‌ను విడుదల చేసింది. "మరో నెలలో అతడి రాక ప్రపంచాన్ని కదిలిస్తుంది, సెప్టెంబర్ 27న థియేటర్లలో అతడి మెజెస్టిక్ మ్యాడ్‌నెస్‌ను చూసేందుకు సిద్ధంగా ఉండండి" అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌తో దేవర సినిమాలో ఎన్టీఆర్ డ్యుయెల్ రోల్ చేస్తున్నారా అనే సందేహాలు మరోసారి షురూ అయ్యాయి.




# ఆ రెండు చిత్రాలకు సీక్వెల్స్ : అశ్వినీ దత్



**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో బ్లాక్ బస్టర్ అయిన చిత్రాల్లో ఇంద్ర, జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమాల సీక్వెల్స్‌పై అశ్వినీ దత్ అదిరిపోయే వార్తను చెప్పారు.

తాజాగా మెగాస్టార్ చిరంజీవి 69వ పుట్టినరోజు సందర్భంగా ఇంద్ర సినిమాను రీరిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. 2002లో విడుదలైన ఈ చిత్రం ఇండస్ట్రీ హిట్? సాధించింది. ఇప్పుడు రీ రిలీజ్‌లోనూ బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లను అందుకుంటోంది. ఈ సందర్భంగా ఇంద్ర చిత్ర బృందాన్ని తన ఇంటికి పిలిచి సన్మానించారు చిరంజీవి. ఈ వేడుకలో నిర్మాత అశ్వినీ దత్, దర్శకుడు బి.గోపాల్‌తో పాటు రచయితలు పరుచూరి బ్రదర్స్, మ్యూ జిక్ డైరెక్టర్ మణిశర్మ, చిన్ని కృష్ణ పాల్గొన్నారు. వీరందరికీ చిరు శాలువాలను కప్పి సన్మానించారు. అనంతరం మీడియాతో ముచ్చటించిన నిర్మాత అశ్వినీ దత్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు. ఇంద్ర, జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమాలకు సీక్వెల్స్ తీసుకొచ్చేందుకు తాను ప్రయత్ని స్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ రెండు సీక్వెల్స్ కోసం అభిమానులు ఎంతో కాలంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని, వీటికి సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తామని వెల్లడించారు.

# అమ్మాకు మోహన్ లాల్ సహా 17 మంది రాజీనామా

**బలగం టీవీ, హైదరాబాద్**

మాలీవుడ్ సీనియర్ యాక్టర్ సిద్ధిఖీ తనను ట్రాప్ చేసి లైంగికదాడి చేశాడంటూ మలయాళ నటి రేవతి సంపత్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీ సర్కిల్‌లో దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(AMMA)కు జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్న సిద్ధిఖీ ఇప్పటికే తన పదవికి రాజీనామా కూడా చేసి..లేఖను ప్రెసిడెంట్ మోహన్ లాల్‌కు అందజేశాడు. తనపై వచ్చిన ఆరోపణల కారణంగానే తాను ఈ పదవి నుంచి వైదొలుగుతున్నానని చెప్పాడు. తాజాగా ఈ వ్యవహారంలో ప్రెసిడెంట్ మోహన్‌లాల్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీనీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. "కమిటీ సభ్యుల్లో కొందరిపై వస్తోన్న ఆరోపణల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ ఎగ్జిక్యూటివ్ కమిటీని రద్దు చేయాలని నిర్ణయించాం.మరో రెండు నెలల్లో ఎన్నికలు నిర్వహించి అనంతరం కొత్త కమిటీ ఏర్పాటవుతుంది" అని అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త నాయకత్వంలో అసోసియేషన్ పునరుద్ధరణ, బలపడుతుంది. మా తప్పిదాలను గుర్తించిన ప్రతీ ఒక్కరికి తాము ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ కమిటీలో జగదీష్, సూరజ్ వెంజరమూడు, టొవినో థామస్ లాంటి పాపులర్ యాక్టర్లున్నారు.

రేవతి సంపత్ చేసిన వ్యాఖ్యలపై సిద్ధిఖీ ఇప్పటికే కేరళ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ప్రధాని మోడీకి అమెరికా అధ్యక్షుడి ఫోన్



**బలగం టీవీ, వాషింగ్టన్**

భారత ప్రధాని నరేంద్ర మోడీపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రశంసలు కురిపించారు. మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించడాన్ని కొనియాడారు. ఈ పర్యటన ద్వారా మోదీ శాంతి సందేశం పంపారని.. కొనసాగుతున్న మానవతా సాయానికి మద్దతుగా నిలిచారని వ్యాఖ్యానించారు. "పోలండ్, ఉక్రెయిన్‌లో మోదీ ఇటీవలి పర్యటన గురించి చర్చించడానికి ఆయనతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయన శాంతి సందేశం, మానవతావాద మద్దతు మెచ్చుకోదగ్గవి. ఇండో-పసిఫిక్‌లో శాంతి, శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి మేం మా నిబద్ధతను పునరుద్ఘాటించాం" అని బైడెన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఆ దేశంలో హిందువులు సహా మైనారిటీలందరికీ భద్రత లభించేలా చూడాల్సి ఉందని వారు పేర్కొన్నారు. ప్రాంతీయ, ప్రపంచవ్యాప్త పరిణామాలెన్నో తమ మధ్య సమగ్రంగా చర్చకు వచ్చాయని, పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నామని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

గత నెల మోదీ చేపట్టిన రష్యా పర్యటనపై అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ తరుణంలో మోదీ ఆగస్టు 23న ఉక్రెయిన్‌లో పర్యటించారు. దీంతో విమర్శలను సమర్థంగా ఎదుర్కోవడానికే మోదీ ఈ పర్యటన చేపట్టారనే విశ్లేషణలు వెలువడ్డాయి. యుద్ధాన్ని ముగించడానికి రష్యాతో చర్చలు జరిపి ఓ పరిష్కారానికి రావాలని ఈ పర్యటన సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి మోదీ సూచించారు. ఈ విషయంలో భారత్ క్రియాశీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.



# నిబంధనల ప్రకారం లేకపోతే నేనే కూల్చివేస్తా

- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

గవర్నమెంట్ రూల్స్ ప్రకారమే గెస్ట్ హౌస్ నిర్మించుకున్నానని మాజీమంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. హిమాయత్‌సాగర్‌లో నిర్మించిన గెస్ట్ హౌస్‌పై మహేందర్ రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెరువులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రాకు మద్దతు తెలిపారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతను సమర్థించారు. తాను ఎలాంటి చెరువు భూమి ఆక్రమించి ఇల్లు కట్టుకోలేదన్నారు. నిబంధనల ప్రకారం లేదని తేలితే తానే కూల్చివేస్తానన్నారు. కేటీఆర్‌కు వాస్తవాలు తెలియక ఉద్దేశ్యపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, కొత్వాల్‌గూడలో తన భవనాలు నిబంధనల ప్రకారం పట్టా భూమిలో నిర్మించారని, నా భవనాలు అక్రమ నిర్మాణాలైతే అధికారులకు సహకరించి కూల్చివేయాలని కోరతానని ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి అన్నారు. 111 జీవో పరిధిలో చాలా మంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ప్రభుత్వం పర్మిషన్ ఇస్తేనే ఇల్లు నిర్మించుకున్నామని మహేందర్ రెడ్డి తెలిపారు.

# గవర్నర్ పర్యటనలో అపశృతి..

- విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు పాముకాటు



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ములుగు జిల్లా పర్యటనలో అపశ్రతి చోటు చేసుకుంది. గవర్నర్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘ టనలు చోటు చేసుకోకుండా గ్రే హౌండ్స్‌తో అధికారులు ముందస్తుగా భారీగా భద్రతా దళాలను మోహరిం చారు. కాగా, వెంకటాపూర్ మండలంలోని దట్టమైన అడవిలో విధుల్లో ఉన్న గ్రేహౌండ్ పోలీస్ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్ అనే వ్యక్తికి పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి సిబ్బంది హుటా హుటున కానిస్టేబుల్‌ను ములుగు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు తరలించి వైద్యమందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఖమ్మంలో రుణమాఫీపై రైతుల ఆందోళన

- రైతులు అపోహ పడొద్దు
- రూ. 31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**బలగం టీవీ, ఖమ్మం బ్యూరో**

రైతు రుణమాఫీపై ఖమ్మం కలెక్టరేట్ వద్ద రైతు సంఘాలు మంగళవారం ధర్నాకు దిగాయి. ఆ సమయంలో కలెక్టరేట్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్కడకు చేరుకున్నారు. ధర్నా వద్దకు వెళ్లి రైతు సంఘం నేతలకు రైతులకు రుణమాఫీపై స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతు రుణమాఫీ అవ్వని రైతులు అపోహ పడొద్దన్నారు. కుటుంబ నిర్ధారణ కానీ రైతుల ఇళ్లకు వ్యవసాయ శాఖ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. రైతుల ఇంటి వద్దే కుటుంబ నిర్ధారణ చేసి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు.

బ్యాంకుల్లో మొత్తం 42 లక్షల రైతులు 31 వేల కోట్లు అప్పు ఉన్నారని తెలిపారు. రెండు లక్షల రుణమాఫీ 18 వేల కోట్ల రైతులు ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. రెండు లక్షల పైన రుణాలు ఉన్న రైతుల రుణమాఫీపై క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీపై కాగ్ నివేదికలో వాస్తవాలు వెల్లడయ్యాయన్నారు. రైతులను గందరగోళం చేసే పనులు చేయొద్దని హితవుపలికారు. సీఎం రేవంత్ రెడ్డి వాగ్దానం చేసినట్లు 31 వేల కోట్లు రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు. మంత్రి స్పష్టతతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

# గుజరాత్‌లో భారీ వర్షాలు..6 వేల మందిని తరలింపు



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

గుజరాత్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. వరుసగా మూడోరోజైన మంగళవారం కూడా కుండపోత వర్షం కురిసింది. దీంతో రాష్ట్రం మొత్తం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో జనజీవనం స్తంభించిపోయింది.%మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ఈ వర్షాలకు ప్రధాన డ్యామ్‌లు, నదుల్లో నీటి మట్టాలు పెరిగాయి. చాలా నదులు ప్రమాదకరస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. పంచమహల్, నవ్‌సారి, వల్సాడ్, వడోదర, భరూచ్, ఖేడా, గాంధీనగర్, బోటాడ్, ఆరావళి జిల్లాల్లో నదులు, డ్యామ్‌ల్లో నీటి మట్టం భారీగా పెరిగి లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తింది. దీంతో ముందుజాగ్రత్త చర్యగా వందలాది మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఇప్పటి వరకూ 6 వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. పంచమహల్‌లో దాదాపు 2,000 మందిని తరలించగా, వడోదరలో 1,000, నవ్‌సారిలో 1,200 మంది, వల్సాద్‌లో 800 మందిని ఇతర ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఇక ఈ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. గాంధీనగర్, ఖేడా, వడోదర జిల్లాల్లో గోడ కూలిన ఘటనల్లో నలుగురు మృతి చెందగా.. ఆనంద్ జిల్లాలో చెట్టు కూలి ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరు వరద నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. బుధ, గురువారాల్లోనూ సౌరాష్ట్ర కచ్ ప్రాంతంలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. గురువారం వరకూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక ఇవాళ కురిసిన తాజా వర్షాల కారణంగా రాజ్‌కోట్ నగరంలో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు, అండర్‌పాస్‌లు పూర్తిగా జలమయమయ్యాయి. ఒక్క రాజ్‌కోట్ నగరంలో ఉదయం 6 గంటల నుంచి నాలుగు గంటల వ్యవధిలోనే 142 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 24 గంటల వ్యవధిలో మొత్తం 251 తాలూకాల్లో కనీసం 24 తాలూకాల్లో 200 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మరో 91 తాలూకాల్లో 100 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. అత్యధికంగా మోర్బి జిల్లాలోని టంకారా తాలూకాలో 347 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. మోర్వ హడాఫ్‌లో 346 మి.మీ, ఖేడాలోని నడియాడ్‌లో 327 మి.మీ, ఆనంద్‌లోని బోర్సాద్‌లో 318 మి.మీ, వడోదర తాలూకాలో 316, ఆనంద్ తాలూకాలో 314 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

# వరంగల్‌లో కొత్త రాజముద్ర కలకలం

- కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీపై అధికారిక చిహ్నం బదులు కొత్త చిహ్నం
- మండిపడ్డ కేటీఆర్




**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ అధికారిక రాజముద్రను మార్చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే బహిరంగంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకోసం ఒక రెండు మూడు నమూనా చిహ్నాలు కూడా పరిశీలిస్తున్నారు. అయితే.. కొత్త చిహ్నం మీద ఎలాంటి అధికారిక ప్రకటన రాకుండానే.. గ్రేటర్ వరంగర్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై తెలంగాణ అధికారిక చిహ్నం స్థానంలో.. మరో కొత్త చిహ్నాన్ని ముద్రించారు. దీనిపె కేటీఆర్.. మండిపడ్డారు. ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇది అధికారిక నిర్ణయమా లేక అనధికార నిర్లక్ష్యమా? అసలు ఏం జరుగుతోందో కనీసం మీకైనా తెలుసా శాంతి కుమారి గారు? తెలంగాణ అస్తిత్వ చిహ్నాలైన కాకతీయ తోరణం, చార్మినార్‌తో ఈ వెకిలి పనులు ఏంటి? కాకతీయ కళాతోరణం, చార్మినార్ లేని రాజముద్రతో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇది. ఈ కొత్త చిహ్నం ఎవరు, ఎప్పుడు ఆమోదించారు? ఒకవేళ ఆమోదించకపోతే అధికారులు ఎందుకు దీన్ని వాడారు? దీనికి కారకులెవరో కనుక్కుని వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను." అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆదేశాలతో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తమ తప్పును సరిదిద్దుకుంది. కాకతీయ కళాతోరణంతో కూడిన రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేసింది. బాధ్యులైన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు షో కాస్ట్ నోటీసులను జారీ చేసింది.